

విద్యార్థులున్నా.. వసతులు సున్నా.. 2



ఘనంగా బోనాలు 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com

## నవోదయ 6వ తరగతి ప్రవేశాలకు ఈనెల 31 వరకు గడువు

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** జవహర్ నవోదయ విద్యాలయంలో 2027-28కు గాను 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువు ఈనెల జూలై 31తో ముగియనుందని ఎంఈవో ఆంధ్రయ్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఎంఈవో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే స్పందించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆయన కోరారు.





## చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తాం

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి పేర్కొన్నారు. ఇటీవల సంఘానికి ఎన్నికలు జరగగా సోమవారం పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికైన గుజ్జ రాజేశ్వరి పూజా కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చేనేతరంగానికి పూర్వ వైభవం తెచ్చేలా పాటుపడతానన్నారు. చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి పెంటి రాజు, కోశాధికారి నందాల నరేష్, డైరెక్టర్లు దిండిగల్ల శంకర్, కైరంకొండ బాల్ రాజ్, కారంపూరి ప్రభు, గాలిపల్లి అరుణ సైతం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో చేనేత సంఘం ఎన్నికల అధికారి పోశన్న, పద్మశాలి హాస్టల్ అధ్యక్షుడు దీకొండ యాదగిరి, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, గౌరవ సలహాదారులు రాపెల్లి గురుచరణ్, నగర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు కన్న దుబ్బరాజం, ప్రధాన కార్యదర్శి చౌటి భూమేశ్వర్, నగర సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్సార్ సత్యపాల్, చేనేత సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సబ్బని ప్రసాద్, జిల్లా సంఘం ప్రతినిధులు లక్కవత్రి దేవిదాస్, బింగి ధర్మవీర్, చింతల గంగాదాస్, గుజ్జ బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్‌ఎం



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ (ఆర్‌ఎం) కృష్ణమూర్తి పరిశీలించారు. బస్టాండ్‌లోని ప్రయాణికుల సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రత, బస్సుల రాకపోకలు, ప్రయాణికులకు అందుతున్న సేవలను పరిశీలించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిపో మేనేజర్ రవికుమార్‌కు సూచించారు. బస్టాండ్‌లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా వసతులను మెరుగుపరచాలని ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సదుపాయాలు తదితర మౌలిక వసతులు సక్రమంగా అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, బస్సుల రాకపోకల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని డీఎం రవికుమార్‌ను ఆదేశించారు.

## 3 నుంచి పీజీ పరీక్షలు

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 28 నుంచి జరగాల్సిన పరీక్షలు వచ్చేనెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని కంట్రోలర్ ఆచార్య సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. పీజీ 4వ సెమిస్టర్ (రెగ్యులర్), 1, 3 సెమిస్టర్ల (బ్యాక్ లాగ్) పరీక్షలు జరుగనున్నాయన్నారు. విద్యార్థులు ఇతర వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# మృత్యుసాగరం



**ఎస్సారెస్పీలో పర్యాటకులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. సరదా కోసం డ్యాంలోకి దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. తాజాగా ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్‌లోని గుంతల్లో మునిగి నలుగురు మృతి చెందడంతో విషాదం నెలకొంది. మరోవైపు ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారాయి. కనీస నిఘా కరువవడంతో ఈ పరిస్థితి నెలకొంది.**

–అక్షరటుడే, ఆర్మూర్

- ఎస్సారెస్పీలో మునిగి చనిపోతున్న పర్యాటకులు..
- నిఘా పెట్టని అధికారులు

ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా పిలిచే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డ్యాం ప్రస్తుతం అసురక్షిత ప్రదేశంగా మారింది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన ఈ ప్రాంతం.. అధికారుల నిర్లక్ష్యం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రతినిత్యం వందల కొద్దిమంది డ్యాం పైకి వస్తుంటారు. డ్యాంపై అటు పోలీసులు కానీ ఇటు డ్యాం అధికారుల నిఘా లేకపోవడంతో మద్యం సిట్టింగులు, ప్రేమికులకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఆదివారం బ్యాక్ వాటర్‌లో స్నానానికి దిగి నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

### సీసీ కెమెరాలు లేవు..

లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే, వేలాది మంది సందర్శకులు వచ్చే శ్రీరాంసాగర్ డ్యాం పై భద్రత పూర్తిగా గాలిలో దీపంలా మారింది. డ్యాంపై, బ్యాక్ వాటర్ ఏరియా, వ్యూ పాయింట్ల వద్ద ఒక్క సీసీ కెమెరా కూడా లేదు. 24 గంటలు ఉండాల్సిన పోలీస్ బృందంలో ఒక్కరూ కనిపించరు. రాత్రి 7 గంటల తర్వాత డ్యాం మొత్తం అంధకారమే. 'లోతు ఎక్కువ.. స్నానాలు నిషేధం' అనే ఒక్క బోర్డు కూడా కనిపించదు. ఫలితంగా డ్యాం చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశాలు, నిర్మానుష్యంగా ఉండే రోడ్లు మద్యం సేవించడం, జంటలు రావడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారాయి.

### బాల్కొండ విడిపోవడంతో..

శ్రీరాంసాగర్ బాల్కొండ మండల కేంద్రంలో ఉన్నప్పుడు ప్రతినిత్యం బాల్కొండ పోలీసులు ముప్కాల్ మీదుగా డ్యాం పైకి వచ్చి పికెట్ నిర్వహించేవారు. అటు తర్వాత మండలం బాల్కొండ, ముప్కాల్, మెండోరాగా విడిపోవడంతో డ్యాం ముందు భాగం మెండోరాకు, మధ్యభాగం ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధికి, వెనక భాగం బాల్కొండ పరిధిలోకి వస్తుంది. దీంతో పికెట్ ఎవరు నిర్వహించాలనే విషయం అగమ్యగోచరంగా మారింది.

### విషాదం.. నిర్లక్ష్యానికి నిదర్శనం..

ఆదివారం సెలవు కావడంతో నిజామాబాద్ నగరంలోని ఆటోనగర్‌కు చెందిన నలుగురు, నాందేడ్ వాసి ఒకరు మొత్తం ఐదుగురు డ్యాంకు వచ్చారు. లక్ష్మీ కాలువ రెగ్యులేటరీ వద్ద ఎలాంటి నిఘా లేకపోవడంతో వారు నీటిలోకి దిగారు. అలా ఒకరిని కాపాడబోయి ఒకరు నలుగురు గల్లంతయ్యారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చేసరికే ఆలస్యమైంది. గతేడాది గేట్లు ఎత్తిన సమయంలో నీళ్లలోకి సరదాగా దిగిన యువకుడు ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. ఇలా గతంలోనూ అనేకమంది యువకులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి.

### రెస్క్యూ బోటు లేదు..

ఆదివారం జరిగిన ఘటనలో భద్రతా లోపాలతో పాటు సౌకర్యాల లేమి కొట్టొచ్చినట్లు కనిపించింది. నలుగురు గల్లంతైన ఘటనలో వారిని వెతికేందుకు కొద్దిసేపు వరకు గజ ఈతగాళ్లు అందుబాటులో లేరు. వారు వచ్చి ముగ్గురు మృతదేహాలు బయటకు తీసేందుకు గంటల సమయం పట్టింది. రెస్క్యూ బోటు కూడా అందుబాటులో లేదు. డ్యాం నిర్వహణ నీటి పారుదల శాఖది, భద్రత పోలీస్ శాఖది, పర్యాటక అభివృద్ధి పర్యాటక శాఖది. కానీ మూడు శాఖలు సైతం ఏదైనా ఘటన జరిగినప్పుడు ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటూ తప్పించుకుంటారనే అపవాదు ఉంది. ప్రతిఏడాది వరదలు, ముంపు, ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం కళ్లు మూసుకుని కూర్చుంటున్నారు. డ్యాంకు వచ్చే ఆదాయంలో ఒక్కశాతం కూడా భద్రత కోసం ఖర్చు చేయడం లేదు.

### ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేస్తాం..

ఎస్సారెస్పీ డ్యాం ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉంది. గేట్ల ముందు భాగం మెండోరా పీఎస్, లక్ష్మీ కెనాల్ నుంచి ముప్కాల్ పీఎస్ పరిధిలోకి వస్తుంది. అలాగే ఎత్తిపోతల పథకం బాల్కొండ పీఎస్ లిమిట్స్‌లో ఉంది. బ్యాక్‌వాటర్ ప్రాంతమంతా ఆర్మూర్, నందిపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఇక డ్యాంకు ముందు భాగం సోన్ (నిర్మల్) పీఎస్ పరిధిలోకి వస్తుంది. గతంలో డ్యాం పూర్తిగా బాల్కొండ పీఎస్ పరిధిలోనే ఉండేది. తాజా సంఘటన నేపథ్యంలో డ్యాంపై పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తాం.

– జాన్‌రెడ్డి, సీఐ, ఆర్మూర్ రూరల్

## బీజేపీకి దేశం ముఖ్యం.. పదవులు కాదు : దినేష్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీజేపీలో పదవులు ముఖ్యం కాదని.. దేశం బాగుండడమే ముఖ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీకి దేశం ముందు అని.. ఆ తర్వాతే పార్టీ అని దినేష్ పేర్కొన్నారు. ఆ సిద్ధాంతానికి కట్టుబడే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంలో ఆయన తప్పు ఏమీ లేకపోయినా, నైతిక బాధ్యత వహిస్తూ దేశ ప్రయోజనాల కోసం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. ఆయన రాజీనామాతో ప్రధాని మోదీ ఓడిపోయారని కొంత మంది దేశ వ్యతిరేక శక్తులు రాక్షసానందం పొందుతున్నాయని పేర్కొన్నారు.

### పాఠ్యాంశాల నుంచి అక్బర్ చరిత్ర తొలగింపు

పాఠ్యాంశాల నుంచి అక్బర్, మొఘలుల చరిత్రను తొలగించి, ఈ దేశపు గొప్ప మహనీయుల చరిత్రను కేంద్ర విద్యాశాఖ చేర్చిందన్నారు. అప్పటి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ, ధర్మేంద్ర ప్రధాన్‌పై కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తమ అక్కసును వెళ్లగక్కుతున్నారన్నారు. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే ప్రధాని మోదీ ప్రత్యేక చొరవ తీసుకుని, విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం కోల్పోకుండా వెంటనే తిరిగి పరీక్షలు నిర్వహించేలా ఆదేశించారన్నారు. ఇది ప్రధాని నైతికతకు నిదర్శనమన్నారు.

### విద్యార్థుల పేరుతో ధర్నాలు..

ఇటీవల విద్యార్థుల పేరుతో ధర్నాలు చేసిన వారికి విదేశీ శక్తుల మద్దతు ఉందని దినేష్ ఆరోపించారు. విద్యార్థుల ముసుగులో చేసిన ఈ ఆందోళనల్లో శ్రీరాముడిని, సీతమ్మ తల్లిని, భారతమాతను అవమానించారని.. ఇది విద్యా



ర్థుల ఆందోళనలా కాకుండా భారతదేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలా ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన కర్ణాటక, రాజస్థాన్ లతో పాటు కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో పీయూసీ, పీఎస్సీ, గ్రూప్‌బి పరీక్షల పేపర్లు లీక్ అయినప్పుడు అక్కడి ముఖ్యమంత్రులు లేదా విద్యాశాఖ మంత్రులు ఎవరైనా రాజీనామా చేశారా అని ప్రశ్నించారు.

### తెలంగాణలోనూ..

తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో ఇంటర్, ఎస్సెస్సీ, గ్రూప్ 1, 2, 3 పేపర్లు లీక్ అయినప్పుడు ఎవరైనా బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారా అని దినేశ్ కులాచారి ప్రశ్నించారు. అప్పటి మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నిస్తే 'ఆ పరీక్షలకు నాకేం సంబంధం' అని బాధ్యతారాహిత్యంగా సమాధానం చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి క్యాండిల్ ర్యాలీలు తీయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, ప్రమోద్ కుమార్, జ్యోతి, శివ ప్రసాద్, ఓం సింగ్, కిషోర్, రాము, కల్పే అర్చన, పిల్లి శ్రీకాంత్, విజయ్, పురుషోత్తం, అన్నం గోపి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టీజీసీజీటీఏ కామారెడ్డి జిల్లా కార్యవర్గం ఎన్నిక




**అక్షరటుడే, కామారెడ్డి:** తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీజీటీఏ) కామారెడ్డి జిల్లా కార్యవర్గ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా ఎన్. రమేశ్ గౌడ్ వ్యవహరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్. రాములు ఎన్నికయ్యారు. రమేశ్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. శివకుమార్, రాములు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు తెలిపి, అధ్యాపకుల సమస్యలను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. కిష్టయ్య, అంకం జయప్రకాష్, ముస్తఫా, యాసీన, డాక్టర్ జి. శ్రీనివాసరావు, శ్రీవల్లి, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ: ఎమ్మెల్యే భూపతిరెడ్డి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ప్రజాస్వామ్య వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని ఎమ్మెల్యే భూపతిరెడ్డి విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డిచ్‌పల్లి మండలం బర్దిపూర్ పరిధిలోని అమృతగార్డెన్‌లో జరిగిన రూరల్ నియోజకవర్గ స్థాయి బూత్ లెవెల్ ఏజెంట్స్, బీఎల్ఏ సమన్వయకర్తలు, మండల అధ్యక్షుడు, డీసీసీ బాధ్యులతో 'ఓటరు జాబితా ప్రత్యేక సవరణ' కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఢిల్లీలో విద్యార్థులు చేసిన ఆందోళనకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నాచేస్తే పోలీసులు అరాచకంగా అరెస్టు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. దేశాన్ని అదాని, అంబానీలు దోచుకుంటున్నారని ఆరోపించారు. చట్టసభల్లో పోటీకి 21 ఏళ్లకే అర్హత కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం అభినందనీయని, దీనికి సంపూర్ణ మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించగా పార్టీ నాయకులు, కార్యకర్తలు చేతులెత్తి మద్దతు తెలిపారు. సీఎంను కలిసి ప్రాణహిత చేవెళ్ల పథకాన్ని కొత్త డిజైన్‌తో రానున్న రెండేళ్లలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా



విమర్శిస్తున్న బీజేపీ నాయకుల ఆగడాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కష్టపడ్డట్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు ఎస్ఐఆర్‌ను భుజాలపై వేసుకుని దిగ్విజయంగా పూర్తి చేస్తుండడం గొప్పవిషయమన్నారు. జిల్లాలో ఎస్ఐఆర్ నమోదులో నిజామాబాద్ రూరల్ అగ్రస్థానంలో ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆకుల లలిత మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌ను పూర్తి చేసినందుకు కార్యకర్తలను అభినందించారు.



### కనువిందు చేసిన అందాల హరివిల్లు

**ఎల్లారెడ్డిలో సోమవారం మోస్తారుగా వర్షం కురిసింది. ఈ సందర్భంగా 44వ జాతీయ రహదారిపై ఆకాశంలో సప్తవర్ణాలతో ఏర్పడిన ఇంద్రధనస్సు అలరించింది. ఆ మార్గంలో వెళ్లేవారు ఇంద్రధనస్సును తమ ఫోన్లలో బంధించి మురిసిపోయారు.**

– సిద్దుగౌడ్, అక్షరటుడే ఎల్లారెడ్డి

www.aksharatodaynews.com
AKSHARA TODAY

## ఘనంగా బారడి పోచమ్మ బోనాలు



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని సోమవారం బారడి పోచమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు, పెద్దలు డప్పుచప్పుళ్ల మధ్య బారడి పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. సర్పంచ్ సంధ్య రాజ్‌కుమార్ బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు ఆందోళన చెందుతున్నారని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని పోచమ్మ అమ్మవారిని వేడుకుంటూ బోనాలు సమర్పించినట్లు తెలిపారు.

## ఆర్డీవో ఆఫీస్ ఎదుట యువతి ఆందోళన




**అక్షరటుడే, బోధన్ :** సర్పంచ్ తనను ప్రేమ పేరుతో మోసం చేశాడని ఓ యువతి ఆందోళనకు దిగింది. ఈ మేరకు బోధన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసింది. పోతంగల్ మండలం జల్లపల్లి ఫారం గ్రామ సర్పంచ్ దస్తగిరి తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని యువతి ఫిర్యాదులో పేర్కొంది. తనను వివాహం చేసుకుంటానని చెప్పి అన్యాయం చేశాడని ఆవేదన వ్యక్తం చేసింది . ఆరేళ్లుగా తాము ప్రేమించుకున్నామని.. రెండుసార్లు తనకు అబార్షన్ సైతం చేయించాడని ఆమె ఆరోపించింది. పెళ్లి చేసుకుందామని అడిగితే తప్పించుకు తిరుగుతున్నాడని.. అతడితో తనకు పెళ్లి జరిపించాలని ఆర్డీవో కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసింది.

## మున్సిపల్ కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న కోటనర్సయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ పాలకవర్గం వారి కుటుంబ సభ్యులను పరామర్శించింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, కమిషనర్ డి.గజానంద్, కౌన్సిలర్లు మృతుడి అంత్యక్రియల నిర్వహణ కోసం మున్సిపాలిటీ తరపున రూ.10వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, రానున్న రోజుల్లోనూ వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గజానంద్, కౌన్సిలర్లు తోట సతీష్, అంజుమ్ అలీ, సందీప్, ప్రజాప్రతినిధులు జేజే నర్సయ్య, కన్నె సురేందర్, ఆరేపల్లి నాగేంద్ర, బోదిరే నర్సయ్య, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రైటింగ్ బోర్డుల అందజేత




**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ మండలంలోని మల్లారంలో ప్రభుత్వ పాఠశాలలో కేజీఎఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైటింగ్ బోర్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవో సేవా హాజరయ్యారు. ట్రస్ట్ ఫౌండర్ జేసీ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.. కేజీఎఫ్ ట్రస్ట్ లక్ష్యం విద్యార్థులకు విద్య,ఆరోగ్యం, క్రీడల్లో సాయం చేయడమేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది ఇప్పుడు ఉన్నతాధికారులు, వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులుగా దేశానికి సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు తప్పక సాయం చేస్తామన్నారు. హెచ్ఎం అన్నం గోపాల్, ఉపాధ్యాయులు వెంకట్, రంగా కిషన్ పాల్గొన్నారు. కేజీఎఫ్ ట్రస్ట్ ఫౌండర్ జేసీ మనోజ్ కుమార్, జనరల్ సెక్రటరీ నాగేందర్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. వీటిని చూసి కళాశాలల్లో చేరుతున్న విద్యార్థులు చదువుకునేందుకు కనీస వసతుల్లేక అవస్థల పాలవుతున్నారు.
–అక్షరటుడే, కామారెడ్డి



# విద్యార్థులున్నా.. వసతులు సున్నా..

- కామారెడ్డి జూనియర్ కాలేజీలో విద్యార్థులు ఇబ్బందులు
- వెయ్యి మంది విద్యార్థులకు 10 గదులే..
- వరండాల్లో చదువుకుంటున్న వైనం

కామారెడ్డి 2016 అక్టోబర్ 11న నూతన జిల్లాగా అవతరించింది. జిల్లా ఏర్పడ్డాక పలు ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు వచ్చాయి. కానీ జిల్లా కేంద్రంలోని ప్రధాన విద్యాసంస్థల్లో ఒకటైన ప్రభుత్వ జూనియర్ కళాశాల మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఏళ్ల నాటి పాత భవనాలు, ఇరుకు తరగతి గదులు, విరిగిన బెంచీలు, ఫ్యాన్లు లేని గదులే ఇప్పటికీ ఇక్కడి నిత్య దృశ్యంలా మారాయి. పాలకులు మారారు, ప్రభుత్వాలు మారాయి కానీ కళాశాల దుస్థితి మాత్రం మారలేదు.

### 1,038 మందికి 10 గదులే..!

కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కలిపి 9 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గతంలో కంటే ఇప్పుడు అడ్మిషన్లు ఒక్కసారిగా పెరిగాయి. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే అత్యధికంగా 1,038 మంది విద్యార్థులు ఈ కళాశాలలో ప్రవేశం పొందారు. కానీ వారికి కేవలం 50 మంది సామర్థ్యం కలిగిన 10 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఒక గదిలో దాదాపు 100 మందికి పైగా విద్యార్థులు కూర్చోవాల్సి వస్తోంది. ఉన్న గదుల్లోనూ డెస్క్ టేబుల్స్, బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు నేలపైనే కూర్చుని నోట్సు రాసుకుంటున్నారు. కొన్ని కోర్సులకు చెందిన విద్యార్థులకు షిఫ్టుల వారిగా బోధన సాగిస్తున్నారు.

### చెట్ల నీడనే పాఠాలు

గదులు సరిపోకపోవడంతో కొన్ని సెక్షన్లకు వరండాలో, మరికొన్నింటికి చెట్ల కిందనే తరగతులు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే తరగతులు నిలిచిపోతాయి. ఎండకు, చలికి విద్యార్థులు అల్లాడిపోతున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతులు ఉన్నా ఫర్నిచర్, తరగతి గదులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రహదారి నుంచి కళాశాలకు వచ్చే దారి కూడా మట్టిరోడ్డు ఉండటంతో వర్షం పడితే బురదమయంగా మారుతోంది.

### ఫైళ్లకే పరిమితమైన ప్రతిపాదనలు

కళాశాల ప్రిన్సిపాల్, అధికారులు కొత్త భవనం, అదనపు గదులు, ఫర్నిచర్ కోసం ప్రభుత్వానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం కళాశాలలో మరొక 15 నుంచి 20 అదనపు తరగతి గదులు నిర్మిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన స్థలం కూడా అందుబాటులో ఉండటంతో నిధులు మంజూరు చేయాలని కోరారు. అయితే అవి కాగితాలకే పరిమితమయ్యాయని తెలుస్తోంది.

### ప్రజాప్రతినిధుల మౌనం..

జిల్లా ఏర్పడి దాదాపు పదేళ్లు అవుతోంది. ఈలోగా చాలా పథకాలు వచ్చాయి, నిధులు వచ్చాయి. కానీ కళాశాలకు మాత్రం ఎలాంటి నిధులు రాలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు కళాశాల సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడున్న నాయకులు కళాశాల అభివృద్ధి విషయంపై ప్రత్యేక దృష్టి సారించడం లేదన్న ఆరోపణలున్నాయి. నాయకులు ప్రత్యేక దృష్టి పెడితే కళాశాలకు కావాల్సిన దాదాపు రూ.2 కోట్ల నిధుల మంజూరు పెద్ద విషయం కాదన్న టాక్ వినిపిస్తోంది. అయితే నాయకులు మనకెందుకు అని పట్టించుకోవడం లేదా..? లేక ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదా అని విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

### జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా..

ప్రభుత్వం ఒకవైపు ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామంటూ ప్రచారం చేస్తోంది. మరోవైపు జిల్లా కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే మారుమూల ప్రాంతాల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న 1,038 విద్యార్థుల సంఖ్య వచ్చే సంవత్సరం పెరిగే అవకాశాలు ఉన్నాయి. కనీసం వచ్చే విద్యా సంవత్సరానికైనా కొత్త భవనం, తగినన్ని తరగతి గదులు, ఫర్నిచర్ కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. వసతులు కల్పించకపోతే హాజరు శాతం తగ్గుతుందని పేర్కొంటున్నారు.

### ప్రతిపాదనలు పంపాం..



కళాశాలకు నేను ప్రిన్సిపాల్‌గా వచ్చి రెండేళ్లు అవుతుంది. అదనపు తరగతి గదులు, ఫర్నిచర్ కావాలని అధికారులకు ప్రతిపాదనలు పంపించాను. ఒకసారి నేరుగా కమిషనర్‌ను కలిసి కోరాను. ప్రతి ఏడాది కళాశాల సమస్యలపై ప్రతిపాదిస్తున్నాం. ఇప్పటికి మంజూరు కావడం లేదు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇబ్బందులు ఉన్నప్పటికీ చేరడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి అదనపు గదులు, ఫర్నిచర్ మంజూరు చేస్తే విద్యార్థులకు ఇబ్బందులుండవు. **– జయకుమారి, ప్రిన్సిపాల్, జూనియర్ కళాశాల**

### నాయకులు స్పందించాలి



కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కళాశాలలో అదనపు గదులు, ఫర్నిచర్ లేకపోవడం దారుణం. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే నాయకులు పట్టించుకోకపోవడం సమంజసం కాదు. జూనియర్ కళాశాలలో గతంలో 300 మంది విద్యార్థులు కూడా ఉండేవారు కాదు. ఇప్పుడు ఏకంగా విద్యార్థుల సంఖ్య 1,100 లకు చేరువలో ఉంది. నాయకులు స్పందించి వసతులు కల్పించాలి. **– వినయ్ కుమార్, టీఎన్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు**

## జీపీలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు




**అక్షరటుడే, బోధన్ :** జీపీలో నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ బోధన్ మండలం బెల్లాల్ జీపీ గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పాలకవర్గ సభ్యులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని గ్రామస్థులు ప్రజావాణిలో ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి పెద్ద ఎత్తున నిధుల గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. హరితహారం మొక్కల పెంపకాన్ని సాకుగా చూపి నిధులు కాజేశారని.. అలాగే వాటర్ పైప్‌లైన్లు చెడిపోతే వాటిస్థానంలో కొత్తవి వేయించుకుండా ఉన్నవాటికే మరమ్మతులు చేయించి బిల్లులు పెట్టారన్నారు. పాడైపోయిన మోటార్ల విషయంలోనూ నిధులు కాజేశారని పేర్కొన్నారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

## ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభం



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలంలోని నాగంపేట్ గ్రామంలో పరిశుభ్రత, ఆరోగ్యం, అభివృద్ధి లక్ష్యంగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులను చేపట్టారు. సర్పంచ్ దాసరి గంగాధర్ మాట్లాడుతూ, ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల మురికినీరు నిల్వ ఉండకుండా ఉంటుందన్నారు. దీంతో దోమల వ్యాప్తి, దుర్వాసన తగ్గుతాయని తెలిపారు. గ్రామ పరిశుభ్రత మెరుగుపడి, సీజనల్ వ్యాధుల నివారణకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మదన్, గ్రామపంచాయతీ కార్యదర్శి కవిత, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన బిగాల



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కేటీఆర్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.


## రైతులకు న్యాయం చేయండి..



**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలోని 983 సర్వేనెంబర్‌లో రైతులకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో లింగంపేట రైతులు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ.. గత వారం సైతం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో మరో మారు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు రైతుల పేర్కొన్నారు. తాతల కాలం నుంచి వంశపారంపర్యంగా వస్తున్న భూమిని ఆర్ఓఆర్ఎఫ్ లో పొందుపర్చి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి లింగంపేటలో రైతులకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోకల సాయిరాం, చింతల సత్యవ్వ, సుప్పాల సాయిలు తదితరులు పాల్గొన్నారు.





## కంటైనర్లలో చదువులు.. విద్యార్థుల అవస్థలు

'కార్పొరేట్' పేరుతో జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో సౌకర్యాలు లేకున్నా ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నారు. చాలా పాఠశాలల్లో సరైన గదులు, క్రీడాస్థలాలు కూడా లేవు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నందిపేట్ మండలంలోని వన్నెల్(కె)లోని జీఎఫ్ఎస్ పాఠశాలలో కంటైనర్లలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. అగ్గిపెట్టెల్లా ఉన్న గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత విద్యాశాఖకు ఇవి కనిపించట్లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
– అక్షరటుడే, నిజామాబాద్